క్లుప్తంగా

ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



ఆయుర్వేద వైద్య శిబిరంలో పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : కేంద్ర ప్రభుత్వ ఆయుష్ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ప్రధాని మోదీ పిలుపు మేరకు దేశ్ కా ప్రకృతి పరిరక్షణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా శనివారం స్థానిక గీతా మందిరంలో లయన్స్ క్లబ్ నాయకుడు మానేపల్లి రామారావు ఆధ్వర్యంలో డాక్టర్ బీవీఎం నగేష్ సారథ్యంలో ఉచిత ఆయుర్వేద వైద్యశిబిరం నిర్వహించారు. 126 మందికి ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు ఉచితంగా అందజేశారు. కేఎల్ సుభద్ర, ఎల్. శ్రీనివాస్, బాబీ జమ వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో బొలిశెట్టి సురేష్, చెన్నా వెంకట్రామయ్య, పిల్లి పండరినాథ్, నంగులూరి శ్రీనివాస్ తదితరులు సేవలు అందించారు.

బాలబాలికలు క్రీడల్లో రాణించాలి



విద్యార్థులకు మెడల్స్ అందించిన దృశ్యం

ఏలూరు రూరల్ : కరాటే, కుంగ్‌ఫూతో పాటు క్రీడల్లో బాలబాలికలు రాణించాలని ఆక్స్‌ఫర్డ్ స్కూల్స్ ఆర్‌ఐ ఉషారాణి అన్నారు. శనివారం ఏలూరు ఇండోర్ స్టేడియంలో ఆక్స్‌ఫర్డ్ పాఠశాల స్పోర్ట్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పిల్లల్లో క్రమశిక్షణ, ఆత్మ విశ్వాసం పెంపొందించేందుకు ఎంతో కృషి చేస్తున్నట్టు చెప్పారు. స్పోర్ట్స్ డే నిర్వహించి ఆటలపై ఆసక్తి పెంచుతున్నామన్నారు. బాలబాలికలకు అథ్లెటిక్స్ విభాగంలో పలు పోటీలు నిర్వహించి, విజేతలకు మెడల్స్, బహుమతులు స్కూల్స్ చైర్మన్ ఫ్రాన్సిస్, ప్రిన్సిపాల్ ఐవీ సుధాకర్ చేతుల మీదగా బహుమతులు అందజేశామని తెలిపారు. కార్యక్రమంలో డైరెక్టర్ విజయ్‌భాస్కరరెడ్డి, జోసఫ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

6న ఐటీడీఏ వద్ద ధర్నా

కుక్కునూరు: గిరిజనుల సమస్యల పరిష్కారం కోరుతూ జనవరి 6న కేఆర్‌పురం ఐటీడీఏ ఎదుట చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపందా జిల్లా కార్యదర్శి షేక్ గౌస్ పిలుపునిచ్చారు. సీపీఐ ఎంఎల్ ప్రజాపందా చుక్కలబొద్ది, తెల్లరాయిగూడెం గ్రామ శాఖల సమావేశం మండల కార్యదర్శి కంగాల కల్లయ్య అధ్యక్షతన నిర్వహించారు. గౌస్ మాట్లాడుతూ కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో వలస గిరిజనులకు ఎస్టీ కులధ్రువీకరణ పత్రాలు, పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని కేంద్ర ట్రైబల్ కమిషన్ ఆదేశించినప్పటికీ, గిరిజనుల సమస్యలు పరిష్కరించలేదన్నారు.

జ్ఞాపకాలను మింగేస్తున్న మధుమేహం

- నాలుగు పదుల వయస్సు దాటితే జరజాగ్రత్త
- ఆరోగ్యంపై శ్రద్ధ అవసరమంటున్న వైద్యులు



ఏలూరు టౌన్: మనిషిని నడిపించేవి జ్ఞాపకాలు. అవే తుడిచిపెట్టుకుపోతే? చేసిన పని గుర్తు లేకపోతే? కన్నబిడ్డల్ని సైతం పోల్చుకోలేని దైన్యస్థితి ఎదురైతే ? అసలు మనమెవరో మనకే తెలియకపోతే? జీవితం ఎంత దుర్భరమో ఊహించుకోవడమే కష్టం. మతిమరుపు (డిమోన్షియా) రుగ్మతతో బాధపడే వారి సంఖ్య రోజు రోజుకూ పెరుగుతుండడం ఆందోళన కలిగిస్తోంది. నేటి ఒత్తిళ్లతో కూడిన జీవన విధానం, కల్తీ ఆహార పదార్థాలు, వాతావరణ పరిస్థితులు మానవ ఆరోగ్యంపై తీవ్ర ప్రభావాన్ని చూపుతున్నాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. ఇటీవల మధుమేహంతో బాధపడేవారి సంఖ్య పెరుగుతుంది. ఏలూరు నగరంలోని ఏడేళ్ల బాలుడు ఒకరు మధుమేహ వ్యాధితో బాధపడుతూ ఇన్సులిన్ తీసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఏలూరు జిల్లాలో సుమారుగా డయాబెటిస్ వ్యాధి బాధితులు లక్షల్లోనే ఉండడం గమనార్హం. 104 సంచార వైద్యశాల వైద్య శిబిరాలకు ప్రతి సంవత్సరం సుమారుగా 3.50 లక్షల మంది డయాబెటిస్ బాధితులు హాజరై ప్రతి నెలా మందులు తీసుకుంటున్నట్టు రికార్డులు చెబుతున్నాయి.

మతిమరుపు సమస్య

డయాబెటిస్ బాధితులు మందులు వేసుకున్నా.. వేసుకోలేదని మళ్లీ వేసుకోవడం, లేకుంటే అసలు వేసుకోకపోవడం, వేసుకున్నట్టుగానే భావించడం వంటివి చేస్తున్నట్టు వైద్యుల అధ్యయనంలో తేలింది. ఇందుకు మతిమరుపే కారణమంటున్నారు. ప్రస్తుతం మధుమేహుల్లో మతిమరుపు సమస్య ప్రధానంగా మారింది. ఇది జన్మతః వచ్చింది కాదు. కొన్నేళ్లుగా డయాబెటిస్ అదుపులో లేకపోవడంతో వచ్చిన సమస్య. ఈ ప్రభావం మందుల వాడకంపై చూపడంతో శరీరంలో షుగర్ లెవల్స్ పెరగడం, ఒక్కసారిగా తగ్గిపోవడం వంటివి చోటుచేసుకుంటూ ప్రమాదకర స్థాయికి చేరుకుంటోందని వైద్య నిపుణులు చెబుతున్నారు.

మధుమేహం సోకి పదేళ్లు దాటితే

మధుమేహం వచ్చి పదేళ్లు దాటిన వారిలో మతిమరుపు సమస్య ఎక్కువగా ఉంటుందని వైద్యులు చెబుతున్నారు. శరీరంలో షుగర్ లెవల్స్ అదుపులో లేని వారికి ఐదేళ్లకే సమస్య వస్తున్నట్టు నిర్ధారించారు. డయాబెటిస్ బాధితుల్లో ఐదు శాతం మందిలో ఈ సమస్య ఉన్నట్టు అధ్యయనాల్లో తేలింది. తీపి గుర్తులను మధుమేహం తినేస్తోందనే అభిప్రాయం ఉంది.

సన్నబడుతున్న రక్తనాళాలు

మధుమేహం ఉన్న వారిలో మెదడకు వెళ్లే మైక్రో వాస్క్యులర్ రక్తనాళాలు సన్నబడటంతో రక్తప్రసరణ తగ్గుతుంది. మెదడుకు సరైన రక్త ప్రసరణ జరగకపోవడంతో మతిమరుపు వస్తున్నట్టు వైద్యులు చెబుతున్నారు. అంతేకాకుండా శరీరంలో షుగర్ లెవల్స్ అదుపులోకి లేని వారిలో ఈ ప్రభావం మెదడుపై చూపి జ్ఞాపికశక్తిని దెబ్బతీస్తుందంటున్నారు. ఇలా దీర్ఘకాలం పాటు మందులు వాడే వారిలో ఇలాంటి లక్షణాలు ఎక్కువగా ఉంటున్నట్టు నిపుణుల అధ్యయనాల్లో తేలింది.

దుష్ఫలితాలు ఎక్కువ



దీర్ఘకాలంగా మధుమేహంతో బాధపడేవారిలో మెదడుకు వెళ్లే రక్తనాళాలు సన్నబడటంతో రక్తప్రసరణ తగ్గి మతిమరుపు వచ్చే అవకాశాలున్నాయి. మధుమేహ రోగుల్లో మతిమరుపు సమస్య ఒక్కో సమయంలో ప్రమాదకరంగా మారుతుంది. శరీరంలో షుగర్ లెవల్స్ పెరగడం, తగ్గడం వంటివి చోటుచేసుకుని మా వద్దకు వస్తుంటారు. ఇలాంటి వారిలో మధుమేహ దుష్ఫలితాలు ఎక్కువగా ఉంటాయి. వారికి మందులు వేసే బాధ్యతను కుటుంబ సభ్యులే చూడాలి.

– బి.రవికుమార్, వైద్య నిపుణులు

మధ్య వయస్కులకు పెనుముప్పు



ఒకప్పుడు 45 ఏళ్లు దాటిన వారిలో షుగర్ లక్షణాలు కనిపించేవి. ప్రస్తుతం 20, 30 వయస్సుపై బడిన వారు సైతం మధుమేహం బారినపడుతున్నారు. ఇటీవల ఏకంగా ఆరేళ్లు, ఏడేళ్ల పిల్లలకు డయాబెటిస్ రావటం మారుతున్న పరిస్థితులకు అద్దం పడుతుంది. మధుమేహ బాధితుల్లో ముఖ్యంగా గత మూడేళ్లుగా 35 నుంచి 40 ఏళ్ల మధ్యలో గుండెపోటు, బ్రెయిన్ స్ట్రోక్, మతిమరుపు సమస్య వస్తోంది.

– ఎ.హరికృష్ణ, వైద్య నిపుణులు

ఉపాధ్యాయుల వాణి వినిపించాలి



గోపిమూర్తికి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి శాసన మండలిలో ప్రస్తావించాలని గోపిమూర్తిని ఏపీటీఎఫ్ 1938 నాయకులు కోరారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఘన విజయం సాధించి శనివారం అమరావతిలోని రాష్ట్ర శాసన మండలిలో ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా ఏపీటీఎఫ్ నాయకులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఉపాధ్యాయ ఉద్యమంలో చురుకుగా పాల్గొని ఎన్నో సమస్యలను పోరాడి సాధించిన గోపిమూర్తి, పాలనా పరంగా తలెత్తే సమస్యలను శాసన సభ ద్వారా పరిష్కరించడానికి తన వాణిని వినిపించాలని కోరారు. గోపిమూర్తికి శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఏపీటీఎఫ్ 1938 రాష్ట్ర అధ్యక్షుడు జి.హృదయరాజు, రాష్ట్ర అకడమిక్ కమిటీ కన్వీనర్ గుగులోతు కృష్ణ తదితరులు ఉన్నారు.

సాగు నీటి సంఘాల ఎన్నిక ఏకగ్రీవం



జాలిపూడి నీటి సంఘం అధ్యక్ష, ఉపాధ్యక్షులకు నియామకపత్రాలు అందిస్తున్న అధికారులు

ఏలూరు రూరల్ : ఏలూరు రూరల్ మండలంలోని శనివారం నిర్వహించిన ఐదు సాగునీటి సంఘాల ఎన్నికలు ఏకగ్రీవంగా జరిగాయని అధికారులు వెల్లడించారు. ఎన్నికైన వారికి నియామకపత్రాలు అందజేశారు. శనివారం నిర్వహించారు. జాలిపూడి నీటి వినియోగదారుల సంఘం అధ్యక్షుడిగా మాగంటి నవీన్‌చంద్రబోస్, ఉపాధ్యక్షుడిగా చుక్కా వెంకటేశ్వరరావు, మాదేపల్లి సంఘం అధ్యక్షుడిగా చింతపల్లి సాల్మన్‌రాజు, ఆమన్ రమణ, మల్కాపురం సంఘం అధ్యక్షుడిగా సుంకర మాధవరావు, మాగంటి కృష్ణ మోహన్, శ్రీపర్రు సంఘం అధ్యక్షుడిగా ఘంటసాల హరికృష్ణ, తలారి చిన్ని ప్రకాశం, చాటపర్రు అధ్యక్షుడిగా ముల్పూరి వీరభద్రరావు, వేమిరెడ్డి సత్యనారాయణ ఎన్నికయ్యారు. ఎన్నికల అధికారులుగా కె.సంతోష్ తదితరులు వ్యవహరించారు.

ఎస్సీ వర్గీకరణ తీర్పు రాజ్యాంగ విరుద్ధం



మాలల గర్జన మహాసభ పోస్టర్లు చూపుతున్న నాయకులు

ఏలూరు (టూటౌన్): ఎస్సీ వర్గీకరణపై ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు భారత రాజ్యాంగానికి పూర్తిగా వ్యతిరేకమని మాల సంఘాల ఫెడరేషన్ (ఎంఎస్ఎఫ్) జేఏసీ ఏలూరు జిల్లా నాయకులు అభిప్రాయపడ్డారు. స్థానిక జిల్లా పరిషత్ అతిథి గృహంలో శనివారం వారు విలేకర్లతో మాట్లాడారు. దేశ అత్యున్నత న్యాయస్థానం రాజ్యాంగం స్ఫూర్తికి విరుద్ధంగా ఎస్సీ వర్గీకరణ ఆయా రాష్ట్రాలు చేసుకోవచ్చని, ఇచ్చిన సూచనను వ్యతిరేకిస్తూ మాల సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 15వతేదీ ఆదివారం గుంటూరులో మాలల గర్జన మహాసభ పేరిట భారీ బహిరంగ సభ ఏర్పాటుచేసినట్టు చెప్పారు. హాలో మాల.. చలో గుంటూరు నినాదంతో ప్రతి ఒక్కరూ తరలి రావాలని కోరారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 341 గురించి పార్లమెంట్‌లో చర్చ జరగకుండా, రాష్ట్రపతి ఆమోదం తెలపకుండా, సుప్రీంకోర్టు సూచన విచారకరమని తెలిపారు. దీనిని ఖండిస్తూ నిర్వహించే బహిరంగ సభకు లక్షలాది మంది తరలి రావాలని కోరారు. ఆంధ్రప్రదేశ్‌లో అతి పెద్ద కులంగా మాలలు ఉన్నారని, దాదాపు కోటి మంది మాలలు వర్గీకరణను వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో మెండెం సంతోష్ కుమార్, రిటైర్డ్ ఐఆర్ఎస్ అధికారి చాగంటి సంజీవ్ కుమార్, ప్రొఫెసర్ ఎన్ ఏడీ పాల్, దాసరి ఆంజనేయులు, పల్లెం ప్రసాద్, దాసరి రమేష్, అలగారవి కుమార్, మెండెం ఆనంద్, పాము శామ్యూల్, ఎరికిపాటి విజయ్, కాపుదాసి రవి, పులవర్తి డేవిడ్, టి.సురేష్, బి.వేణు, కె.మురళీకృష్ణ, సీహెచ్ బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

నృత్య పోటీల విజేతలు వీరే



కూచిపూడి నృత్యం ప్రదర్శిస్తున్న శ్వేతా ప్రసన్న

ఏలూరు (ఆర్ఆర్‌పేట): నగరానికి చెందిన అభినయ నృత్యభారతి సంస్థ 29వ వార్షికోత్సవాల్లో భాగంగా నిర్వహించిన జాతీయ స్థాయి నృత్యపోటీల విజేతల వివరాలను నిర్వాహకులు శనివారం ప్రకటించారు. ఈ పోటీలకు న్యాయ నిర్ణేతలుగా ఆర్ ఉమా రాణి, కె.రాజ రాజేశ్వరీ దేవి, రఘుపాత్రుని శ్రీకాంత్, రమా కౌండిన్య శ్రీభాష్యం న్యాయ నిర్ణేతలుగా వ్యవహరించారు. శనివారం వివిధ రాష్ట్రాలకు చెందిన నర్తకులు ప్రదర్శించిన విభిన్న నృత్యరీతులు ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. బెంగళూరుకు చెందిన శ్వేతా ప్రసన్న కూచిపూడి, భువనేశ్వర్‌కు చెందిన తనూజ కుమార్ పండా ఒడిస్సీ, వరంగల్‌కు చెందిన పెంద్యాల లక్ష్మీప్రియ కూచిపూడి, వన్నాల కస్తూరి పేరిణి లాస్యం, సూర్యాపేటకు చెందిన పి.సుమంత్ పేరిణి శివ తాండవం, కాకినాడకు చెందిన పి.పద్మిని ఆంధ్ర నాట్యం ప్రదర్శించి అలరించారు. వీరిని అభినయ నృత్య భారతి సంస్థ నృత్య కౌముది అవార్డులతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమాలను అభినయ నృత్య భారతి సంస్థ వ్యవస్థాపక కార్యదర్శి డి.హేమసుందర్ పర్యవేక్షించారు.

కూచిపూడి సబ్ జూనియర్స్

టి.ఓజస్విని (ప్రథమ), సి.మిషిక (ద్వితీయ) (అనంతపురం), దేదీప్య (తృతీయ) (అమలాపురం). ప్రోత్సాహక బహుమతులు మనస్విని (నరసాపురం), పి.రిషిక (హన్మకొండ), జనన్య వర్మ (వరంగల్), కాత్యాయని, మోక్షత (విజయవాడ), ధన్వి శ్రీ (తణుకు). ప్రత్యేక బహుమతులు భువన చంద్రిక (ఖమ్మం), తన్విత (విశాఖపట్నం), కె.ప్రణవి (అమలాపురం), సింధుజ ప్రియ (హన్మకొండ), తుస్య (ఏలూరు), లాస్యశ్రీ (తణుకు), గీతాన్షి శ్రీ (విజయవాడ), ఎ.ఆకాంక్ష (పాల్వంచ), ఆలియా (విజయవాడ).

జానపదం సబ్ జూనియర్స్

మిహిర ప్రేమమయి (ప్రథమ), ఎ.భవిష్య (ద్వితీయ) (ఏలూరు), వైష్ణవి విహారి (తృతీయ, హన్మకొండ). ప్రోత్సాహక బహుమతులు రిషిప్రియ (ఏలూరు), ధన్వి శ్రీ (తణుకు), దేవాన్స్ (ఏలూరు). ప్రోత్సాహక బహుమతులు సాయి సహస్ర, ఎ.విస్మయ వల్లిక (ఏలూరు), సింధుజా ప్రియ (హన్మకొండ).

183 మందికి వైద్య పరీక్షలు



రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ కృష్ణ

ఏలూరు (టూటౌన్): స్థానిక శ్రీకృష్ణ ఆస్పత్రిలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 183 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి, అవసరమైన వారికి మందులు అందించారు. పేద ప్రజలకు సేవ చేయాలనే ఆలోచనతో ప్రతి నెలా రెండో శనివారం క్రమం తప్పకుండా ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహిస్తున్నట్టు ఈ సందర్భంగా ఆస్పత్రి ఎండీ డాక్టర్ బి.కృష్ణ తెలిపారు. ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

శ్రీవారి పథకాలకు విరాళం

ద్వారకాతిరుమల: శ్రీవారి నిత్యాన్నదాన పథకానికి హైదరాబాద్‌కు చెందిన వడ్లమూడి సరోజిని రూ.1,00,116, చిన నిండ్రకొలనుకు చెందిన జి.మధుసాయి చరణ్ రూ.1 లక్ష, విమాన గోపుర స్వర్ణమయ పథకానికి మధుసాయి చరణ్ రూ.2 లక్షలు శనివారం అందించారు. వీరికి ఆలయ సూపరింటెండెంట్‌లు హయగ్రీవాచారి, జి.సుబ్రహ్మణ్యంలు విరాళం బాండ్ పత్రాలను అందజేశారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	24
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	21
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్‌ఏసీ స్లీపర్)	22.30	00
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	30

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.45	4820	09
ఏలూరు - బీహెచ్‌ఈఎల్	21.15	4822	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	19
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	13
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	12
ఏలూరు-బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	20
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	20
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	04
ఏలూరు - తిరుపతి	16.00	4830	30


కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06–08
వంకాయలు (గులాబీ)	24	చిక్కుడు కాయలు	40
వంకాయలు (కాంతులు)	34	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	34	ములక్కాడలు	10, 15
బెండకాయలు	34	కంద	60
పచ్చిమిర్చి	24	బీట్‌రూట్	54
కాకర కాయలు	28–36	కీరా దోస	44
బీరకాయలు	28	ఫ్రెంచ్‌బీన్స్	80
బీరకాయలు (పందిరి)	48	అల్లం	70
క్యాబేజీ	30–36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	56	పాలకూర	10
దొండకాయలు	30	చుక్కకూర	10
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36–55	గోంగూర	07
గోరుచిక్కుడు	26	పుదీనా	05
దోసకాయలు	20–24	బఠాణీ	--
ఆనబకాయ (1)	20–25	క్యాప్సికమ్	76
పొట్లకాయ(1)	20–25	చిలకదదుంప	36

అంతా పొల్లు.. రైతు ఘొల్లు

- రైతులను ముంచిన 1318 రకం వరి
- 25 బస్తాల్లోపే దిగుబడి
- ప్రతికూల వాతావరణంతో ఫలితం తారుమారు
- అన్నదాతల ఆశలపై నీళ్లు



అదును దాటిపోతున్నా పూర్తిగా తయారుకాని వరి కంకులు (ఫైల్)

గణపవరం: సార్వా పంట రైతును దెబ్బమీద దెబ్బ కొట్టింది. సాగుచేసిన రైతుల్లో 75 శాతం మందికి పెట్టుబడులు కూడా దక్కలేదు సరికదా, భారీ నష్టాలు చవిచూశారు. ముఖ్యంగా 1318 రకం వరి రైతులను నిలువునా ముంచేసింది. ఈప్రాంతంలో రైతులు ఈ రకం వరిని సాగుచేయడం అరుదు. రెండోసారి నాట్లు వేయడానికి నారుమడులు వేస్తే ఆలస్యమవుతుందన్న ఉద్దేశ్యంతో కొందరు రైతులు, జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి, పొరుగు జిల్లాల నుంచి రైతులు నారును కొని తెచ్చుకున్నారు. అక్కడ ఎక్కువగా 1318 రకం నారు దొరకడంతో రైతులు దానినే కొనుగోలు చేసి తెచ్చుకున్నారు. ఎకరాకు రూ.5 నుంచి రూ.6 వేలు వెచ్చించి మరీ నారు కొని తెచ్చుకున్నారు.

దిగుబడిపై ప్రభావం

1318 రకం నారు నాటిన తర్వాత వరి దుబ్బుచేసి, ఈనిక వరకూ బాగానే ఉంది. అక్కడి నుంచే పరిస్థితి ప్రతికూలంగా మారింది. ఈనిక తర్వాత పాలుపోసుకునే దశలో వర్షాలు పడటంతో వెన్నులో ఎక్కువ గింజలు తోడుకోక పోవడంతో తాలుగా మారిపోయాయి. దీనితో దిగుబడి ఎకరాకు 25 బస్తాలు కూడా రావడంలేదని రైతులు వాపోతున్నారు. ఎక్కువగా 22 బస్తాల వరకూ దిగుబడి వస్తోందని రైతులు చెబుతున్నారు.

3 వేల ఎకరాల్లో సాగు

గణపవరం, నిడమర్రు మండలాల్లో 1318 రకం వరిని సుమారు మూడువేల ఎకరాల్లో సాగు చేశారు. ఈ రకం వరి ఈ ప్రాంత రైతులకు పరిచయం లేదు. సార్వా నాట్లు వేసిన తర్వాత వరదలు రావడంతో వరినాట్లు కుళ్లిపోయాయి. దీనితో రైతులు జిల్లాలోని ఇతర ప్రాంతాల నుంచి ఈరకం నారు కొనుగోలు చేసి నాట్లు వేసుకున్నారు.

20 రోజులు ఆలశ్యంగా సాగు

ఈనిక వరకూ ఏపుగా దుబ్బు చేసి బాగానే ఉన్న వరి ఈనిక తర్వాత గింజ సరిగా తోడుకోలేదు. దీనితో వెన్నులో సగానికి సగం గింజ లేకుండా తప్పలుగా మారి దిగుబడి 25 బస్తాలు కూడా రావడంలేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. ముందుగా వేసిన నాట్లు వరదనీటిలో మునిగి పనికిరాకుండా పోవడంతో 20 రోజుల ఆలశ్యంగా రెండోసారి నాట్లు వేశారు. దీనితో ఈ రకం మాసూళ్లు ఇతర రకాలకన్నా 20 రోజుల ఆలశ్యమైంది. ఇప్పటికే 90 శాతం రైతులు మాసూళ్లు పూర్తిచేసి ధాన్యం విక్రయించుకోగా, మరికొందరు రైతులు ధాన్యం ఒబ్బిడి చేసి ఉంచారు. 1318 రకం వరి ఇంకా కోతకు రాలేదు. నాలుగైదు రోజుల్లో ఈరకం వరి మాసూళ్లు పూర్తయ్యే అవకాశం ఉంది.

సాల్వేషన్ ఆర్మీ చర్చి ప్రారంభోత్సవం

దెందులూరు: దెందులూరులో సాల్వేషన్ ఆర్మీ చర్చిని సాల్వేషన్ ఆర్మీ లెఫ్టినెంట్ కల్నల్ ఎం స్టాలిన్, వైఎస్ కేజీయా స్టాలిన్ శనివారం ప్రారంభించారు. గ్రామానికి చెందిన ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీతలు పల్లె యోహాను చంద్రహాస కేటాయించిన స్థలంలో చర్చి నిర్మించారు. సాల్వేషన్ ఆర్మీ డివిజనల్ కమాండర్ జె.మోషే ఆధ్వర్యంలో దెందులూరు కోర్ ఆఫీసర్ ఎం రమణయ్య అధ్యక్షతన ప్రత్యేక ప్రార్థనలు చేశారు. స్టాలిన్, కేజియా స్టాలిన్లకు దెందులూరు బస్టాండ్ సెంటర్ నుంచి గౌడ వీధిలోని చర్చి వరకు సంఘస్తులు గృహ సమితి సభ్యులు సండే స్కూల్ చిన్నారులు ఘన స్వాగతం పలికారు. నూతన చర్చి సంఘం అభివృద్ధికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని, సహాయ సహకారాలు అందిస్తానని కల్నల్ దంపతులు అన్నారు. డీవైఎస్ టి.శ్యాంబాబు, రిటైర్డ్ ఆఫీసర్ జోషియా, కోర్ ఆఫీసర్లు సంఘ సభ్యులు ఉన్నారు.

ఘన సన్మానం : చర్చి స్థల దాతలు పల్లె హర్షవర్ధన్ సిలువ కుమారిని కల్నల్ దంపతులు డివిజనల్ కమాండర్ దంపతులు సత్కరించారు. హర్షవర్ధన్ దంపతులు యుగంధర్ అనిత కుటుంబ సభ్యులు లెఫ్టినెంట్ కల్నల్ దంపతులను సన్మానించారు.

విర్డ్ ఆస్పత్రి సేవలు మరింత విస్తృతం



శస్త్రచికిత్సలు విజయవంతంగా నిర్వహించిన వైద్య బృందం

ద్వారకాతిరుమల: స్థానిక విర్డ్ (శ్రీ వేంకటేశ్వర ఇనిస్టిట్యూట్ ఆఫ్ సర్జరీ రీసెర్చ్ అండ్ రిహాబిలిటేషన్ ఫర్ ద డిజేబుల్డ్) సేవలను మరింతగా విస్తృత పరుస్తామని ఆస్పత్రి ట్రస్ట్ చైర్మన్ ఎస్వీ సుధాకరరావు తెలిపారు. అమెరికాకు చెందిన ప్రముఖ వైద్యులు శ్రీనాథ్ కామినేని ఆధ్వర్యంలో ఈనెల 11న విర్డ్‌లో ప్రారంభమైన చారిటబుల్ ఆర్థోపెడిక్ క్యాంప్ శనివారంతో ముగిసింది. ఈ క్యాంప్‌లో భుజం, మోచేయి, తుంటి, మోకాలు సమస్యలతో తీవ్రంగా బాధపడుతున్న 65 మంది రోగులను పరీక్షించిన డాక్టర్ కామినేని, 25 మంది రోగులకు విజయవంతంగా శస్త్ర చికిత్సలు నిర్వహించారు. దివ్యాంగులకు కాలిపర్స్, ప్రమాదాల్లో కాళ్లు కోల్పోయిన వారికి అత్యాధునిక కృత్రిమ అవయవాలను అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ కామినేని మాట్లాడుతూ ఆరోగ్య సమస్య వచ్చిన వెంటనే వైద్యులను సంప్రదించి, తగు చికిత్స పొందాలని సూచించారు. ఆస్పత్రి ట్రస్ట్ సభ్యులు ఐవీఆర్ సుధాకరరావు, వెంపరాల నారాయణమూర్తి, వైద్యులు భవ్యచంద్, హమీద్, బాలాజీ, విహారి, పీవీ నాగేంద్రబాబు, సింధు, కె.శ్రీనివాస్, బీఎస్, ఎల్లోరా పార్వతి పాల్గొన్నారు.